సాక్షి మహబూబాబాద్

బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



మార్కెట్‌లో మౌలిక వసతులేవి?
వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మౌలిక వసతులు లేవంటూ అడ్తి వ్యాపారులు, ఖరీదు దారులు మంగళవారం ధర్నా చేశారు.
- 8లో▸



మినీ జాతరకు వేళాయె..
మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతర కు వేళాయింది. నేటి (బుధవారం) నుంచి పూజ కార్యక్రమాలు మొదలుకానున్నాయి.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
37.0⁰ /16.6⁰

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరం గా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

నేడు సాక్షి ఫోన్ ఇన్



సైబర్ క్రైం డీఎస్పీ కె.శ్రీనివాస్

మహబూబాబాద్ రూరల్: సైబర్ నేరాలు.. నివారణ చర్యలు, అపరిచిత ఫోన్ కాల్స్, బాధితులు డబ్బులు పోగొట్టుకోవడం.. తదితర అంశాలపై జిల్లా సైబర్ పోలీసు అధికారులతో బుధవారం సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. బాధితులు, ప్రజలు ఫోన్ చేసి అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చు.

అంశం: సైబర్ నేరాలు.. నివారణ చర్యలు
తేదీ: 05-02-2025(బుధవారం)
సమయం:
ఉదయం 11నుంచి 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు:
సైబర్ క్రైం డీఎస్పీ కె.శ్రీనివాస్
87126 65570,
సీఐ ఎం.వెంకటేశ్వర్లు
87126 65598,
ఎస్సై బి.కరుణాకర్
95534 30564, 96034 62487

న్యూస్‌రీల్

కేసీఆర్‌ను కలిసిన సత్యవతి



కురవి: శాసన మండలిలో బీఆర్‌ఎస్ పార్టీ విప్‌గా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్‌ను మంగళవారం ప్రకటించడంతో ఆమె బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి తనను విప్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఏ బాధ్యతలు పెట్టినా కష్టపడి, నిజాయితీగా పనిచేశానని తెలిపారు. విప్ పదవితో మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు.

రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీ



కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని హరిక్రిష్ణ రైస్‌మిల్లులో సివిల్ సప్లయీస్ శాఖ డీఎం క్రిష్ణవేణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వానాకాలం సీఎంఆర్ కింద మిల్లుకు కేటాయించిన ధాన్యం, ఇప్పటి వరకు ఎంతమేర ప్రభుత్వానికి బియ్యం అందజేశారనే వివరాలను ఆమె తెలుసుకున్నారు. మిల్లుకు 4,496 టన్నుల ధాన్యం కేటాయించగా, ఇప్పటివరకు 1,537 టన్నుల బియ్యం అందించారని, ఇంకా 1,475 టన్నుల బియ్యం అందించాల్సి ఉందని ఆమె తెలిపారు. కాగా జిల్లాలో 39 మిల్లులకు సీఎంఆర్ కింద 1,35,618 టన్నుల ధాన్యాన్ని కేటాయించగా, ఇప్పటి వరకు 25శాతం బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి అందించినట్లు ఆమె తెలిపారు. వ్యాపారులు వోలం క్రిష్ణమూర్తి, వోలం మురళీ, మార్కెట్ డైరెక్టర్ చిదురాల వసంతరావు ఉన్నారు.

రామప్పలో విదేశీయుల సందడి



వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రామప్ప దేవాలయాన్ని మంగళవారం ఇంగ్లండ్‌కు చెందిన కార్ల్, లిన్ సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని వారు దర్శించుకోగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప శిల్పకళ సంపద బాగుందని కొనియాడారు.

పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: ఈనెల 20 నుంచి పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య బీఎస్ఎల్ సౌజన్య తెలిపారు. కేయూలోని పీజీ కోర్సులైన ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్ఎం, ఎంఎల్ఐఎస్సీ కోర్సుల (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20, 22, 24, 27, మార్చి 1, 3వ తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

స్పెషల్ ఆఫీసర్ ఆదేశాలతో ముమ్మరంగా తనిఖీలు
- మానుకోట మున్సిపాలిటీలో భారీగా కవర్లు స్వాధీనం
- అన్ని పురపాలికల్లో తనిఖీ చేయాలని సూచన
- యాక్షన్ ప్లాన్ తయారీలో నిమగ్నం



మానుకోటలో భారీగా స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు(ఫైల్)

మహబూబాబాద్: జిల్లాలోని మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మానుకోట, మరిపెడ, డోర్నకల్, తొర్రూరు, కేసముద్రం మున్సిపాలిటీల స్పెషల్ ఆఫీసర్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మున్సిపాలిటీల్లో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. మానుకోట, తొర్రూరులోని షాపుల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. మానుకోటలో భారీగా ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు.

ఇటీవల ముగిసిన పాలకమండలి పదవీకాలం

జిల్లాలోని మానుకోట, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మున్సిపాలిటీల పాలకమండలి పదవీకాలం జనవరి 26తో ముగిసింది. కాగా అదేరోజు ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ స్పెషల్ ఆఫీసర్ల నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్ లెనిన్‌వత్సల్ టొప్పోను నియమించగా.. జనవరి 28న బాధ్యతలు స్వీకరించారు. వెంటనే నాలుగు మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్‌ను నిషేధించాలని, వెంటనే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని తనిఖీలు చేయాలని ఆదేశించారని అధికారులు తెలిపారు.

మానుకోటలో ఒక్కరోజే 900కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం..

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు ఉండగా 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు ఉన్నారు. కాగా స్పెషల్ ఆఫీసర్ ఆదేశాలతో యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్, పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి ఆధ్వర్యంలో సిబ్బంది పలు షాపుల్లో తనిఖీలు చేశారు. కాగా జనవరి 29న ఒక్క రోజే 900కేజీల కవర్లు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.30,000పైనే ఉంటుందని, రూ.10,000 జరిమానా విధించినట్లు తెలిపారు. కాగా 2024 సంవత్సరంలో మొత్తంగా 900 కేజీల ప్లాస్టిక్ మాత్రమే స్వాధీనం చేసుకోగా.. ఈ ఏడాది ఒక్క రోజే 900 కేజీల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకోవడం గమనార్హం. ఇదే విధంగా తనిఖీలు చేస్తే మానుకోట మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఉండదు.



ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న షాపు యజమానికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్)

మిగిలిన మున్సిపాలిటీల్లో..

- తొర్రూరు మున్సిపాలిటీలో 16వార్డులు ఉండగా 19,100 మంది జనాభా ఉంది. 2024 సంవత్సరంలో కేవలం 20 కేజీల కవర్లు స్వాధీనం చేసుకుని రూ.5,000 జరిమానా మాత్రమే విధించారు. స్పెషల్ ఆఫీసర్ ఆదేశాలతో గత నెల 29న తనిఖీలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు.
- డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో 15 వార్డులు ఉండగా 14,425 మంది జనాభా ఉంది. కాగా 2024 సంవత్సరంలో కేవలం 50 కేజీల ప్లాస్టిక్ కవర్లు మాత్రమే సీజ్ చేశారు. 2022లో మాత్రం ట్రాక్టర్ లోడ్ ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు పంపామని తెలిపారు. యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని త్వరలోనే తనిఖీలు ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు.
- మరిపెడ మున్సిపాలిటీలో 15 వార్డులు ఉండగా 17,875 మంది జనాభా ఉంది. గత ఏడాది సుమారు 25 కేజీల కవర్లు స్వాధీం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. నామమాత్రంగా తనిఖీలు చేశారు. ఇటీవల కేసముద్రం గ్రామం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. కమిషనర్‌గా ప్రసన్నరాణి గత నెల 28న బాధ్యతలు స్వీకరించారు. అక్కడ కూడా తనిఖీలు చేసే అవకాశం ఉంది.

తనిఖీలు చేస్తున్నాం..

స్పెషల్ ఆఫీసర్ ఆదేశాలతో ప్లాస్టిక్ నిషేధంపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. గత నెల 29నుంచి తనిఖీలు చేపడుతున్నాం. మానుకోటను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చేందుకు చర్యలు తీసుకుంటాం. ప్లాస్టిక్ కవర్ల విక్రయాల విషయంలో ఎవరిని వదిలే ప్రసక్తేలేదు. వ్యాపారులు, ప్రజలు సహకరించాలి.

-నోముల రవీందర్,
మానుకోట మున్సిపల్ కమిషనర్

సంక్షేమ కార్యక్రమాలు పూర్తి చేయాలి

- డీఎంహెచ్ఓ మురళీధర్



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మురళీధర్

నెల్లికుదురు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలు వందశాతం పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ మురళీధర్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీని మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఆశాడే కార్యక్రమాన్ని పరిశీలించి వైద్యశాలలో ప్రసూతి కేసులు, చిన్నపిల్లల టీకాలు, టీబీ, లెప్రసీ, గర్భిణులకు పరీక్షలు పూర్తి చేయాలని అన్నారు. మండల వైద్యాధికారి శారద, సిబ్బంది శాంతమ్మ, మంగమ్మ, రజని, వసంత, షాహీన్, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల సందర్శన

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలను డీఎంహెచ్ఓ మురళీధర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో రికార్డులు, మందులను పరిశీలించారు. సకాలంలో వైద్యులు విధులకు హాజరుకావాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. నార్మల్ డెలివరీలు పెరిగే విధంగా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం పీహెచ్‌సీల్లో ఆశాడే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై పలు సూచనలు చేశారు. డీపీహెచ్ఎన్ మంగమ్మ, మెడికల్ ఆఫీసర్ నంబీకిషోర్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి జాతరలో తాగునీటి సౌకర్యం



కందికొండలో ట్యాంకును పరిశీలించి మాట్లాడుతున్న సీఈ లలిత

కురవి: మహాశివరాత్రి నుంచి జరగబోయే వీరభద్రస్వామి జాతరలో భక్తులకు తాగునీరు సరఫరా చేస్తామని మిషన్ భగీరథ సీఈ జి.లలిత అన్నారు. మంగళవారం మండలంలోని కందికొండ గ్రామంలోని శిథిలావస్థకు చేరుకున్న ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీలించారు. కురవిలో త్వరలో జరగబోయే వీరభద్రస్వామి జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి సరఫరా చేసేందుకు అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. కందికొండ గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త ట్యాంకును మంజూరు చేస్తామని తెలిపారు. వీరభద్రస్వామి జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యాన్ని మెరుగుపరుస్తామని అన్నారు. అలాగే రాబోయే వేసవికాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరేష్, విజయలక్ష్మి, ఎస్ఈ సురేందర్, ఈఈ కృష్ణారెడ్డి, డీఈఈ అనూష, ఏఈఈ ఇంట్రా అనూష, ఏఈఈ గ్రిడ్ హన్మంతు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన డీడబ్ల్యూఓ

మరిపెడ రూరల్: పిల్లలకు పౌష్టికాహారం అందిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని డీడబ్ల్యూఓ ధనమ్మ అన్నారు. మండలంలోని నీలికుర్తి సెక్టార్‌లోని మూన్యతండా అంగన్‌వాడీ కేంద్రం, నీలికుర్తి గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్-2 భవనాన్ని డీడబ్ల్యూఓ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మూన్యతండా అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులు, హాజరు పట్టికలను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆయా అంగన్‌వాడీ పరిధిలో ఉన్న గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నారు. మరిపెడ ఐసీడీఎస్ సీడీపీఓ ఎల్లమ్మ, సూపర్ వైజర్ రాణి, మూన్యతండా అంగన్‌వాడీ టీచర్ కనకమ్మ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

- 20 తులాల వెండి ఆభరణాల అపహరణ
- మరో రెండుచోట్ల దొంగతనానికి విఫలయత్నం



కానిస్టేబుల్ ఇంట్లో బీరువాపై ఫింగర్ ప్రింట్స్‌ను సేకరిస్తున్న క్లూస్ టీం

కేసముద్రం: దుండగులు ఇంటికి వేసి ఉన్న తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన కేసముద్రం మున్సిపాలిటీలో జరిగింది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం పట్టణానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ అంబాల కిరణ్ మూడు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి తన స్వగ్రామం ఇంటికన్నెలో నిర్వహించిన కాటమయ్య పండుగకు వెళ్లారు. మంగళవారం ఉదయం కానిస్టేబుల్ తిరిగి కేసముద్రం వచ్చారు. ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండటంతో వెంటనే లోపలికి వెళ్లి చూడగా బీరువా డోరు పగులగొట్టి, అందులో ఉన్న 20 తులాల వెండి(4 జతల వెండి పట్టీలు) ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించాడు. ఈమేరకు స్థానిక పోలీసులకు సమాచారం అందించగా, ఎస్సై మురళీధర్‌రాజు పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం రంగంలోకి దిగి బీరువా, తలుపులపైన ఉన్న ఫింగర్ ప్రింట్స్‌ను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మరో రెండుచోట్ల..

అలాగే సోమవారం రాత్రి కేసముద్రంస్టేషన్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఓ పాన్‌షాపునకు వేసిన తాళం పగులగొట్టి చోరీకి ప్రయత్నించారు. అయితే ఆ షాపులో డబ్బులు, విలువైన వస్తువులు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అదే విధంగా ఆదివారం రాత్రి స్థానిక రామమందిరం సమీపంలోని ఓ ఇంటి తాళాలు పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. ఇలా కేసముద్రంలో వరుస ఘటనలు జరుగుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- డీఎస్పీ కృష్ణ కిశోర్



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కృష్ణ కిశోర్

పెద్దవంగర: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ కృష్ణ కిశోర్ అన్నారు. మంగళవారం మండలంలోని వడ్డె కొత్తపల్లి గ్రామంలో నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేందుకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరుపుకునేలా తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఇతరులను ఇబ్బంది పెట్టే పోస్టులు పెట్టవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ గణేష్, ఎస్సై క్రాంతికిరణ్, పోలీస్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

- సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

నెహ్రూసెంటర్: కార్పొరేట్ శక్తులకు ప్రయోజనాలు కలిగించేలా కేంద్ర బడ్జెట్ ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతన జీవులు, కార్మికులు, కర్షకులు, సామాన్య ప్రజలకు లబ్ధి చేకూర్చకుండానే దేశ ప్రజల బడ్జెట్ అని ప్రధాని మోదీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటు, రైల్వే కోచ్‌లకు నిధుల ఊసే లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్, సమ్మెట రాజమౌళి, దుడ్డెల రాంమూర్తి, రావుల రాజు, కుమ్మరికుంట్ల నాగన్న, హేమా నాయక్, చీపిరి యాకయ్య, మహ్మద్ రజాక్, చాగంటి భాగ్యమ్మ, మందుల మహేందర్ పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో త్వరలో నిర్వహించే శాసనమండలి, పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 482 గ్రామపంచాయతీల్లో 4,110 వార్డుల వారీగా ఓటరు జాబితా సవరణపై అభ్యంతరాలు ఉంటే తెలియజేసి సహకరించాలన్నారు. జిల్లాలో సెకండ్ సప్లిమెంటరీ ఓటరు జాబితా సవరణపై మండలస్థాయి సమావేశాలు నిర్వహించి వివరాలు సేకరిస్తామన్నారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 193 ఎంపీటీసీ స్థానాలపై చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, జెడ్పీ సీఈఓ పురుషోత్తం, డీపీఓ హరిప్రసాద్, రాజకీయ పార్టీల నాయకులు సురేష్, మార్నేని వెంకన్న, పెరుగుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణకు కృషి చేయాలి

జిల్లాలో పక్కా ప్రణాళికతో నట్టల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేయాలన్నారు. ముందుస్తుగా విద్యార్థులకు సమాచారం ఇవ్వాలని, ప్రధానంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు ముఖ్యపాత్ర వహించాలన్నారు. మాత్రలు వేసుకున్న వారి వివరాలు, అలాగే వేసుకోని వారి వివరాలను నమోదు చేసుకుని స్పెషల్ డ్రైవ్ ద్వారా మాత్రలు అందించాలన్నారు. ప్రతీ విభాగానికి నోడల్ అధికారిని నియమించి పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ పురుషోత్తం, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఎంహెచ్ఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక



ఎస్పీతో పోలీసు అధికారులు, సిబ్బంది

మహబూబాబాద్ రూరల్: జాతీయ స్థాయి పోలీసు క్రీడలకు జిల్లా పోలీసు శాఖ నుంచి పలువురు అధికారులు, సిబ్బంది ఎంపికయ్యారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన మూడో తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2025లో పలువురు ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. వీరిలో కొందరు జాతీయస్థాయి పోలీసు క్రీడలకు ఎంపిక కాగా.. మంగళవారం వారిని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించారు. జాతీయ స్థాయి పోలీసు క్రీడలకు ఎంపికైన వారిలో ఆర్ఎస్సై శేఖర్ (హ్యాండ్ బాల్), పీసీ అనూష (కబడ్డీ), పీసీ ప్రవీణ్ కుమార్ (కబడ్డీ), ఏఆర్ పీసీ లింగారెడ్డి (క్రాస్ కంట్రీ), సౌభాగ్య, భార్గవి ఉన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

- టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు

మహబూబాబాద్: పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, హెచ్ఆర్ఏను 17శాతానికి పెంచాలని టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం మానుకోట జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానుకోట పట్టణానికి సీసీఏ అలవెన్స్ రూ.700 ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు క్లియర్ చేసి క్యాష్‌లెస్ విధానంలో ఈహెచ్ఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో టీజీఓ ఆఫీస్ బిల్డింగ్ కోసం స్థలం కేయించాలని, టీజీఓ సభ్యులకు హౌస్ బిల్డింగ్ సొసైటీ ద్వారా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం టీజీఓ జిల్లా డైరీని ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, హరికోట్ల రవి, రాజేష్, ప్రసాద్, శ్రీనివాస్, రాజశేఖర్, వేలాద్రి, శైలజ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రమీల
- బలపాల పీహెచ్‌సీ సందర్శన



సిబ్బందితో మాట్లాడుతున్న ప్రమీల

కురవి: గర్భిణులకు సాధారణ ప్రసవాలు జరిగే విధంగా ప్రోత్సహించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రమీల సూచించారు. మంగళవారం మండలంలోని బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆశడే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సాధారణ ప్రసవాలన్నీ ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగే విధంగా వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ప్రసవానంతరం సరైన సేవలందించాలన్నారు. వైద్య సిబ్బంది ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్యసేవలు అందించాలని తెలిపారు. మాతా శిశు సంరక్షణ చర్యలు, వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు స్రవంతి, కరుణాకర్, యశస్విని, వైద్య సిబ్బంది భద్రమ్మ, కుమారస్వామి, శోభ, స్వామి, ఏసుమణి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం సులువు

- మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల

వరంగల్: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం వల్ల వ్యవసాయంలో సులువుగా పనులు చేయొచ్చని వరంగల్ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల అన్నారు. మార్కెట్‌లోని మన అగ్రిటెక్‌లో మంగళవారం డ్రోన్ స్ప్రేయర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో మానవ లోకం ఎంతో ముందడుగు వేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వంచే ఆమోదించిన ప్రముఖ దక్ష కంపెనీ రూపొందించిన డ్రోన్ స్ప్రేయర్లను రైతులకు మన అగ్రిటెక్ అధినేత పాశికంటి రమేశ్ అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. మన అగ్రిటెక్ ఎండీ రమేశ్ మాట్లాడుతూ.. డ్రోన్ 10 లీటర్ల నీటి సామర్థ్యంతో ఎకరా కేవలం 5–7నిమిషాల వ్యవధితో పిచికారీ చేస్తుందని, ఒకసారి బ్యాటరీ చార్జ్ చేస్తే 3ఎకరాల వరకు పనిచేస్తుందన్నారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకట్‌రావు, నూతనకల్ పీఏసీఎస్ చైర్మన్ జయసుధ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.


డ్రోన్ స్ప్రేయర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్మల

ప్రేమపేరుతో బాలికపై లైంగికదాడి

- గర్భం దాల్చడంతో విషయం వెలుగులోకి..
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో నిందితుడిపై పోక్సో కేసు

ఖిలా వరంగల్: బాలికను ప్రేమపేరుతో ఓ యువకుడు లైంగికంగా లోబర్చుకున్నాడు. చివరికి ఆమె గర్భవతి కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మంగళవారం వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ రైల్వేగేట్ ప్రాంతానికి చెందిన బాలిక (16) ఇంటర్మీడియట్ చదువుతోంది. కాలేజీకి వెళ్లి వచ్చే క్రమంలో ఇదే ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆదిల్ (20), బాలిక మధ్య పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త రెండేళ్లుగా ప్రేమగా మారింది. కొద్ది నెలలుగా ప్రేమ, పెళ్లి పేరుతో ఆ బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాలికకు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో తల్లిదండ్రులు వైద్యులకు చూపించగా గర్భవతి అని తేలింది. ఈవిషయంపై తల్లిదండ్రులు బాలికను నిలదీయడంతో విషయం చెప్పింది. మంగళవారం మిల్స్‌కాలనీ పీఎస్‌లో బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలికను ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు చేయించగా గర్భవతని తెలిసింది. ప్రేమ, పెళ్లి పేరుతో లైంగికదాడికి పాల్పడి బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

పోలీసుల అదుపులో యువకుడు..

ప్రేమ, పెళ్లి పేరుతో బాలికకు లైంగికంగా దగ్గరై గర్భవతిని చేసిన యువకుడిని మంగళవారం సాయంత్రమే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

మార్కెట్‌లో మౌలిక వసతులేవి?

- వైఫై, పీఓఎస్ మిషన్లు లేక ఇబ్బందులు
- మొక్కుబడిగా వైద్యసేవలు
- వసతులు కల్పించాలని అడ్తి వ్యాపారులు, ఖరీదుదారుల ధర్నా
- రెండు గంటల పాటు నిలిచిన కాంటాలు, క్రయ,విక్రయాలు
- అధికారుల హామీతో ధర్నా విరమణ.. కొనసాగిన మిర్చి కొనుగోళ్లు


మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యాపారులు

వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్.. ఆసియా ఖండంలోనే అతిపెద్దది. ఇక్కడికి రాష్ట్రంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు తమ పంట సరుకుల విక్రయానికి వస్తారు. తమ పంట ఉత్పత్తుల విక్రయాలకు రైతులు.. కొనుగోలు చేసేందుకు వందలాది మంది వ్యాపారులు.. కాంటాలు వేసేందుకు దడవాయిలు, హమాలీలు, కార్మికులు.. ఇలా మొత్తం సుమారు రెండు వేల నుంచి ఐదు వేల మంది వరకు నిత్యం మార్కెట్‌కు వస్తుంటారు. ఈ క్రమంలో ఇంతటి ప్రాధాన్యం కలిగిన మార్కెట్‌లో మౌలిక వసతులు లేవంటూ మంగళవారం అడ్తి వ్యాపారులు, ఖరీదుదారులు మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ ధర్నాతో కాంటాలు నిలిచిపోయాయి. దీంతో మిర్చి కొనుగోళ్లు నిలిచాయి. సోమవారం అడ్తివ్యాపారి కడారి సదానందం మార్కెట్‌లోని ఓ హోటల్ వద్ద టీ తాగుతూ గుండెపోటుతో మృతి చెందాడు. అతడి మృతికి సంతాపం వ్యక్తం చేసిన అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ యార్డులలో క్లీనింగ్ లేకపోవడం, రవాణా వాహనాలు, మిర్చి ఘాటుతో గుమస్తాలు, దడువాయిలు, రైతులు, హమాలీ కార్మికులు, వ్యాపారులు అనారోగ్యంతో చనిపోతున్నారన్నారు. అత్యవసర సమయాల్లో బాధితులకు చికిత్స చేయడానికి 24 గంటలు మార్కెట్‌లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్నారు. అలాగే, మార్కెట్‌లో వైఫై లేక పీఓఎస్ యంత్రాలు సరిగా పనిచేయడంలేదన్నారు. ఫలితంగా కాంటాలు ఆలస్యం కావడం, చోరీలు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీంతో మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు సమకూర్చాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు లిఖితపూర్వకంగా విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల ఘటనాస్థలికి చేరుకుని మూడు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి చర్చించిన అనంతరం మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం కాంటాలు జరగడంతో యథావిధిగా మిర్చి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో చాంబర్ ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాశ్, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లే సంపత్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వసతుల కల్పనపై జేడీఎం సమీక్ష..

మార్కెట్‌లో మౌలిక వసతులపై వ్యాపారులు ధర్నా నిర్వహించడంతో మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్, జేడీఎం శ్రీనివాస్ అధికారులతో సమావేశమయ్యారు. ఉన్నతాధికారుల అనుమతితో మార్కెట్‌లో వసతులు కల్పిస్తామని చాంబర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. సమీక్షలో మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల, ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, గ్రేడ్ 2 కార్యదర్శులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.


కాంటాలు నిలిచిపోవడంతో బస్తాలపై కునుకు తీస్తున్న రైతులు

పీఓఎస్ మిషన్లు సమకూర్చాలి



మార్కెట్‌లో 120 మంది దడవాయిలం ఉన్నాం. ప్రస్తుతం 40 పీఓఎస్ మిషన్లు మాత్రమే పనిచేస్తున్నాయి. 80 మిషన్లు వస్తున్నాయని రెండేళ్లుగా అంటున్నారే తప్పా రావడం లేదు. కార్యదర్శి 10 మిషన్లు వచ్చాయని చెప్పారు. వాటిలో యాప్ ఇన్‌స్టాల్ చేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి.

-సోల రవి, దడవాయి యూనియన్ సెక్రటరీ

సౌకర్యాలు కల్పించాలి



మార్కెట్‌లో ఎండ వేడి తట్టుకోలేకపోతున్నాం. విశ్రాంతి భవనంలో వసతులు సమకూర్చాలి. మూత్రశాలలు శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలి. అలాగే, మార్కెట్‌లోని మెడికల్ సెంటర్‌లో వైద్య సౌకర్యాలు కల్పించాలి.

-పసునూటి మల్లయ్య, రైతు, ఇల్లంతకుంట మండలం, కరీంనగర్

తాగునీటి సౌకర్యం మెరుగుపర్చాలి



మార్కెట్‌లో యార్డు చుట్టూ నల్లాలు ఉన్నా నీళ్లు సరిగా రావడం లేదు. లోపలకు వెళ్తే ఎందుకు వస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. తాగునీటి సౌకర్యం మెరుగుపర్చాలి. కార్మికులు అస్వస్థతకు గురైతే ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి. అంబులెన్స్ ఉంటే వ్యాపారి బతికేవాడు.

-అప్సర్ హమాలీ కార్మికుడు

మార్కెట్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలి



నిత్యం వేలాది మంది రైతులు, వ్యాపారులు, కార్మికులు ఉండే మార్కెట్‌లో వైద్య సేవలు అందించేందుకు పీహెచ్‌సీ(బస్తీ దవాఖాన)ఏర్పాటు చేయాలి. గుండెపోటుకు గురైన వ్యాపారిని సకాలంలో 108లో ఆస్పత్రికి తరలిస్తే బతికేవాడు.

-డి.కరుణాకర్, గుమస్తాల సంఘం నాయకుడు

రోడ్డు ప్రమాదంలో వైద్యుడి దుర్మరణం

- మేడ్చల్‌లో ఘటన.. మృతుడు శనిగపురం వాసి


శ్రీచరణ్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఓ వైద్యుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటనతో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన చుక్క శ్రీనివాస్, వాణి దంపతుల పెద్ద కుమారుడు శ్రీచరణ్ (26) మేడ్చల్ జిల్లా కేంద్రంలోని కిమ్స్ ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా మంగళవారం ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి వెళ్తుండగా మేడ్చల్ జిల్లా కేంద్రంలోని క్రాస్ వద్ద కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీచరణ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలిసి మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వెంటనే మేడ్చల్ వెళ్లారు.

ఇంటికి నీళ్లు కొడుతుండగా..

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- రాయికుంట తండాలో ఘటన


సతీశ్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఇంటికి నీళ్లు కొడుతుండగా విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ మండలం ఉత్తర తండా జీపీ పరిధిలోని రాయికుంట తండాలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బోడ రాంసింగ్, బుజ్జి దంపతులు నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ దంపతుల చిన్నకుమారుడు సతీశ్ (23) స్విచ్ బోర్డుకు విద్యుత్ తీగలను అమర్చి కొంత సమయం తర్వాత మోటారు ఆన్ చేసి ఇంటికి నీళ్లు కొడుతున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ వైరు కిందపడగా తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబీకులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రాంసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్లు రూరల్ ఎస్సై దీపిక తెలిపారు. మృతుడికి భార్య బింధు, మూడు నెలల కుమార్తె ఉంది.

మహాకుంభాభిషేకం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో ఈనెల 7,8,9 తేదీల్లో జరగనున్న మహాకుంభాభిషేకం వాల్‌పోస్టర్‌ను హైదరాబాద్‌లో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ ఈ.శ్రీధర్ ఆవిష్కరించారు. మంగళవారం ఆర్జేసీ రామకృష్ణారావు, ఈఓ ఎస్.మహేశ్, ఉపప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్ర శర్మ హైదరాబాద్ వెళ్లి వేర్వేరుగా వాల్‌పోస్టర్‌ను ఉన్నతాధికారులతో ఆవిష్కరింపజేశారు. అనంతరం ఆహ్వాన పత్రికలు అందజేశారు.

మినీ జాతరకు వేళాయె..

- నేడు మేడారం, కన్నెపల్లిలోని ఆలయాల్లో గుడి మెలిగె పండుగ
- వనదేవతల జాతరకు ఏర్పాట్లు సిద్ధం


కన్నెపల్లిలోని సారలమ్మ గుడి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతర(మండమెలిగె పండుగ)కు వేళయింది. నేటి(బుధవారం) నుంచి పూజ కార్యక్రమాలు మొదలు కానున్నాయి. ఇందులో భాగంగా మేడారంలోని సమ్మక్క గుడి, కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో గుడిమెలిగె పండుగ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. సమ్మక్క పూజారులు ఉదయం సమ్మక్క గుడికి చేరుకుని అమ్మవారి వస్త్రాలు, పూజ సామగ్రిని శుద్ధి చేస్తారు. గుడిని శుద్ధి చేసిన తర్వాత సిద్ధబోయిన మునీందర్ ఇంటి నుంచి పూజారులు, ఆడపడుచులు డోలివాయిద్యాలతో పసుపు, కుంకుమ తీసుకుని సమ్మక్క గుడికి వెళ్తారు. గుడిలో అప్పటికే పూజారి కొక్కెర కృష్ణయ్య అలికి సిద్ధంగా ఉంచిన అమ్మవారి శక్తిపీఠంపై ఆడపడుచులు ముగ్గులు వేసి అలంకరిస్తారు. అనంతరం అడవి నుంచి తీసుకొచ్చిన ఎట్టిగడ్డిని సమ్మక్క గుడి భవనం ఈశాన్యం మూలన పెడతారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో..

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిని సారలమ్మ పూజారులు, ఆడపడుచులు కలిసి శుద్ధి చేస్తారు. అమ్మవారి గుడిలో, ఆవరణలో ముగ్గులు వేస్తారు. సారలమ్మ వస్త్రాలు, పూజ సామగ్రిని ప్రధాన పూజారి సారయ్య శుద్ధి చేస్తారు. సారలమ్మ వద్దె కుండలను పసుపు, కుంకుమతో ఆడపడుచులు అలంకరిస్తారు. అనంతరం గుడిలో పూజారులు అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. మండమెలిగె పండుగకు వారానికి ముందు గుడిమెలిగె పండుగను నిర్వహిస్తారు. ఈనెల 12వ తేదీన (బుధవారం) మేడారం, కన్నెపల్లిలో మండమెలిగె పండుగ నిర్వహించనున్నారు. గుడిమెలిగె పండుగతో పూజ కార్యక్రమాలు మొదలు కానున్నాయి.

జాతరకు ఏర్పాట్లు సిద్ధం..

మినీ మేడారం జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని అధికారురులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. జాతరలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి సీతక్క.. అధికారులను ఇప్పటికే పలుమార్లు ఆదేశించారు. దీంతో కలెక్టర్ దివాకరటీఎస్ జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించారు. జాతర సమీపిస్తుడడంతో అధికారులు మిగిలిన పనులన్నీ పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అలాగే, ఎస్పీ శబరీశ్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీస్‌శాఖ పకడ్బందీ ఏర్పాట్లలో నిమగ్నమైంది.

జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- ఎనిమిది రోజులు.. 200 బస్సులు.. 400 ట్రిప్పులు
- ఈ నెల 9 నుంచి 16 వరకు..
- మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం

హన్మకొండ/ఎస్ఎస్ తాడ్వాయి : ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో జరగనున్న మినీ జాతరకు టీజీ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈ మేరకు అధికారులు ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి బస్సులు నడపనున్నారు. ఎనిమిది రోజులు.. 200 బస్సులు.. 400 ట్రిప్పులు నడిపేలా ప్రణాళిక రూపొందించారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా అప్పటికప్పుడు బస్సులు పంపేందుకు సమాయత్తమయ్యారు. ఈ నెల 9 నుంచి ఉదయం 6 గంటల నుంచి హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి మేడారానికి బస్సులు నడపనున్నారు. 9న 15 బస్సులు, 10న 10, 11న 10, 12న 20, 13న 25, 14న 50, 15న 20, 16న 50 బస్సులు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేశారు. వీటితో పాటు అవసరమైతే అదనపు బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం..

మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ప్రత్యేక బస్సుల్లోనూ మహాలక్ష్మి పథకం అమలు చేయనున్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా హనుమకొండ, మేడారం బస్ స్టేషన్లలో రోజూ డిపో మేనేజర్‌తో పాటు ఇద్దరు కంట్రోలర్లు ప్రత్యేక బస్సుల ఆపరేషన్ పర్యవేక్షిస్తారు.

భక్తులు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి



మేడారం మినీ జాతరకు వెళ్లే భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రయాణికుల రద్దీని బట్టి హనుమకొండ నుంచి రోజూ 24 గంటల పాటు ప్రత్యేక బస్సులు నడుపుతాం. భక్తులను క్షేమంగా చేరవేయడమే లక్ష్యం. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ఆర్థికంగా నష్టపోవద్దు. ప్రమాదాలకు గురి కావొద్దు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించి వనదేవతలను దర్శించుకోవాలి. వివరాలకు ఆర్టీసీ హనుమకొండ బస్ స్టేషన్ ఎంక్వైరీ 9959226056 నంబర్‌లో సంప్రదించాలి.

-డి.విజయ భాను, ఆర్టీసీ ఆర్ఎం, వరంగల్

పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రతాప్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: అధ్యాపకులు పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తూ.. అకడమిక్ పరంగా ముందుకెళ్లాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి సూచించారు. కేయూ సెనెట్‌హాల్‌లో మంగళవారం అన్నివిభాగాలు, యూనివర్సిటీ కళాశాలల అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల, ప్రొఫెసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల అటెండెన్స్ కోసం ఫేస్ రికగ్నైజేషన్ టెక్నాలజీని అమలు చేయబోతున్నట్లు వెల్లడించారు. ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్‌గా మార్చేలా ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. కే హబ్‌లోని పరిశోధన కేంద్రాలకు రూ.15 కోట్లు మంజూరైన నేపథ్యంలో పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.31 కోట్ల బడ్జెట్ ఉత్తర్వులు వచ్చాయన్నారు. అధ్యాపకులు, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు పీఆర్‌సీ ఏరియర్స్‌ను మార్చి వరకు బకాయిలు లేకుండా చెల్లిస్తామన్నారు. రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడారు.

లెర్నింగ్ నిరంతర ప్రక్రియ..

లెర్నింగ్ నిరంతర ప్రక్రియ అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. రెండు వారాలుగా ఇంటెన్సివ్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్సెల్ టూ పవర్ బీఐఫర్ ఎన్‌సీసీ జవాన్ల శిక్షణ కార్యక్రమం మంగళవారం కంప్యూటర్ సైన్స్ విభాగంలో ముగిసింది. ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శిక్షణ పొందిన జవాన్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సమావేశంలో రిజిస్ట్రార్ రామచంద్రం, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి రమ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మల్లారెడ్డి, డాక్టర్ మంజుల, డాక్టర్ రమేశ్, నీలిమ, సలోని ఫాతిమా, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పృథ్వీరాజ్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ రవిసునారే, తదితరులు పాల్గొన్నారు.

గాయపరిచిన ఘటనలో ఇద్దరికి జైలు

మహబూబాబాద్ రూరల్ : ఓ వ్యక్తిని గాయపరిచిన ఘటనలో ఇద్దరికి ఏడాది చొప్పున జైలు శిక్ష, రూ. 4 వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ తిరుపతి మంగళవారం తీర్పు ఇచ్చారు. కోర్టు డ్యూటీ అధికారి చిగురు నరేందర్ కథనం ప్రకారం.. 2018 అక్టోబర్ 26వ తేదీన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం (వి)లో వినాయక చవితి సందర్భంగా చిలుముల నరేశ్ నృత్యం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన వేముల శ్రీనివాసరెడ్డి, ఆరెందుల కుమారస్వామి.. నరేశ్‌తో వాగ్వాదానికి దిగి అతడిపై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై నరేశ్ అదే రోజు కేసముద్రం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై బి.సతీశ్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించి 2019 జనవరి 7వ తేదీన కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలత కోర్టులో వాదనలు వినిపించగా ప్రస్తుత రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్ రాజు ఆధ్వర్యంలో సీడీఓ నరేందర్ సాక్షులను ప్రవేశపెట్టారు. వాదనలు విన్న ఏ.జే.ఎఫ్.సీ.ఎం తిరుపతి.. నేరం నిరూపణ కాబడిన శ్రీనివాసరెడ్డి, కుమారస్వామికి ఏడాది చొప్పున జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

విద్యారంగానికి తక్కువ నిధులు

- ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

కేయూ క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించారని, మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేదని కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కళాశాలలోని ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన చర్చలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వేతన జీవులకు సంవత్సరానికి రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడం ఊరటనిచ్చే అంశమని తెలిపారు. ఎకనామిక్స్ విభాగం ఇన్‌చార్జ్ అధిపతి డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బడ్జెట్‌తో సామాన్యులు ఏమీ లాభంలేదని తెలిపారు. ఉద్యోగ రంగాలకు కేటాయింపులు లేవన్నారు. బీసీ జాక్ చైర్మన్ డాక్టర్ తిరునహరిశేషు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తేనే దేశాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. తెలంగాణకు నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రమేశ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు ఎక్స్‌పర్మెంటల్ హాల్టింగ్

- 5 రైల్వే స్టేషన్లలో 10 రైళ్లకు..

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని పలు రైల్వే స్టేషన్లలో పలు రైళ్లకు ఎక్స్‌పర్మెంటల్ హాల్టింగ్ కల్పిస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం రాత్రి తెలిపారు. ఆయా రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం కొనసాగుతున్న రైళ్లకు ప్రయోగాత్మక హాల్టింగ్ మరో 6 నెలల పాటు పొడిగించినట్లు తెలిపారు.

హాల్టింగ్ కల్పించిన రైళ్లు ఇవే..

వరంగల్‌లో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి చెన్నై సెంట్రల్–హజ్రత్‌నిజాముద్దీన్ (12611) ఎక్స్‌ప్రెస్, బెల్లంపల్లిలో ఫిబ్రవరి 5వ తేదీ నుంచి హజ్రత్‌నిజాముద్దీన్–తిరుపతి (12708) ఎక్స్‌ప్రెస్, ఖమ్మంలో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి ఎర్నాకులం–పాట్నా (22669) పాట్నా ఎక్స్‌ప్రెస్, పెద్దపల్లిలో ఫిబ్రవరి 4 తేదీ నుంచి చెన్నై సెంట్రల్–అహ్మదాబాద్ (12656) నవజీవన్ ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 3వ తేదీ నుంచి అహ్మదాబాద్–చెన్నై సెంట్రల్ (12655) నవజీవన్ ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 4వ తేదీ నుంచి సికింద్రాబాద్–హిసర్ (22737) ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 6వ తేదీ నుంచి హైదరాబాద్–రక్సోల్ (17006) రక్సోల్ ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 9వ తేదీ నుంచి రక్సోల్–హైదరాబాద్ (17005) రక్సోల్ ఎక్స్‌ప్రెస్, నెక్కొండలో ఫిబ్రవరి 4వ తేదీ నుంచి సికింద్రాబాద్–గుంటూరు(12706) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, గుంటూరు–సికింద్రాబాద్ (12705) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లకు 6 నెలల పాటు ఎక్స్‌పర్మెంటల్ హాల్టింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.